## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే అరూరి రమేశ్ పరామర్శ

హసన్‌పర్తి, అక్టోబర్ 29: గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేటకు చెందిన జనుగాని శంకర్ తండ్రి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఎమ్మెల్యే అరూరి రమేశ్ ఆదివారం హాజరయ్యారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇదే గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి రాజిరెడ్డి, సందెల లచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. కాగా గ్రామశాఖ అధ్యక్షుడు పోలెపల్లి రాజు, సూరం మనోహర్, జనుగాని నవీన్, సిలువేరు రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పాక్స్ చైర్మన్ వనంరెడ్డి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, ఆత్మ డైరెక్టర్ పంజాల భూపాల్‌గౌడ్, సూరం వాసుదేవరెడ్డి, రవి ఉన్నారు.



గ్రామ అధ్యక్షుడు పోలెపల్లి రాజును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేశ్

## పెద్దమ్మగడ్డలో కేంద్ర బలగాల కవాతు

సుబేదారి, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో ఆదివారం కేంద్ర సీఆర్‌ఫీఎఫ్, బీఎస్‌ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించారు. ములుగురోడ్డు జంక్షన్ నుంచి పెద్దమ్మగడ్డ, యాదవనగర్, కొత్తూరు, కుమార్‌పల్లి, హనుమకొండ బస్‌స్టేషన్, అదాలత్ జంక్షన్ వరకు కవాతు నిర్వహించారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దమ్మగడ్డ-యాదనగర్ రోడ్డులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

# రక్తదానం ప్రాణదానంతో సమానం

### ఏసీపీ రఘుచందర్

వర్ధన్నపేట, అక్టోబర్ 29: రక్తదానం ప్రాణదానంతో సమానమని వర్ధన్నపేట ఏసీపీ రఘుచందర్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఏబీఎస్ ఫంక్షన్‌హాల్‌లో పోలీసులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏసీపీ రఘుచందర్ హాజరై రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, పండ్లు అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ మానవులకు అన్నిరకాల వస్తువుల, ఔషధాలను తయారు చేసే అవకాశం ఉండగా, రక్తాన్ని మాత్రం తయారు చేయలేమన్నారు. యువకులు రక్తదానం చేస్తే ప్రమాదంలో ఉన్నవారికి రక్తాన్ని అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ఆరోగ్యవంతులు విధిగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. అత్యవసర సమయంలో ఎవరికైనా రక్తం అందాలంటే బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉండాలన్నారు. అందుకే పోలీసులు కూడా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రక్తాన్ని దానం చేసిన వారు కొత్త రక్తం ఉత్పత్తి అయి ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రక్తాన్ని దానం చేసిన జవాన్లు, యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, వర్ధన్నపేట సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, విజయ్‌కుమార్, మహేందర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, యువకులు, జవాన్‌లు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

## ‘కిట్స్’లో టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

హసన్‌పర్తి, అక్టోబర్ 29: ఎర్రగట్టు గుట్ట సమీపంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో వరంగల్ జిల్లా టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ 2023 పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపాల్ కే అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరక ఆరోగ్యాన్ని, మానసిక దృఢత్వాన్ని కాపాడుకోవడానికి టేబుల్ టెన్నిస్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పోటీలు వరంగల్ డిస్ట్రిక్ట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకారపు హరీశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్ 11 నుంచి 19 వరకు బాలబాలికలు, బాలురు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు సుమారు 170 మంది క్రీడాకారులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. డబ్ల్యూడీటీటీఏ సంయుక్త కార్యదర్శి అజ్మీరాజైసింగ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, వెంకటస్వామి, పీఆర్‌వో ప్రభాకరాచారి పాల్గొన్నారు.



టేబుల్ టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి

## శిలాఫలకం ధ్వంసం

ఐనవోలు, అక్టోబర్ 29: మండలంలోని నర్సింహులగూడెంలో రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రూ.2.39కోట్ల పంచాయతీరాజ్ నిధులతో నర్సింహులగూడెం నుంచి కొండపర్తికి బీటీ రోడ్డు నిర్మించారు. ఇందుకు ఈనెల 5న ఎమ్మెల్యే అరూరి రమేశ్ రోడ్డు ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ పంచాయతీ కారోబార్ కుంటాల బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.



గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన శిలాఫలకం

# రాజకీయ పార్టీలు నిబంధనలు పాటించాలి

- సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలు చేయొద్దు
- అల్లర్లు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణవేణి

నర్సంపేట, అక్టోబర్ 29: రాజకీయ పార్టీల నాయకులు విధిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని నర్సంపేట ఆర్డీవో కృష్ణవేణి సూచించారు. నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఆమె వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసీల్దార్లు, పోలీసులు, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 62 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. వాటి జాబితాను జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లపై ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రాజకీయ పార్టీల సభలు, సమావేశాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కోరారు. వాహనాలు, ప్రచార రథాలకు భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ ప్రతి రాజకీయ పార్టీ సహకరించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోషల్‌మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసుకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రచారంలో పరస్పర అల్లర్లు జరిగే ప్రదేశాలపై తగిన సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పోలీసులకు సమాచారం ఇస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చూడాలన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ సహకరించాలన్నారు. సమీక్షలో డీసీపీ రవీందర్, ఏసీపీ తిరుమల్, తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నర్సంపేట రూరల్ మండల యూత్ కన్వీనర్‌గా రవితేజ

నర్సంపేటరూరల్, అక్టోబర్ 29: బీఆర్‌ఎస్ నర్సంపేట రూరల్ మండల యూత్ కన్వీనర్‌గా నాగుర్లపల్లికి చెందిన మచ్చిక రవితేజగౌడ్‌ను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ తెలిపారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం నియామక పత్రం అందజేశారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మచ్చిక నర్సయ్యగౌడ్, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ మోతె జయపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, కొడారి రవన్న, భూక్యా వీరన్న, కట్ల సుదర్శన్‌రెడ్డి, కడారి కుమారస్వామి, రాంప్రసాద్ పాల్గొన్నారు.



నియామక పత్రం అందజేస్తున్న సత్యనారాయణ

## నేడు వరంగల్ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ రద్దు

ఖిలావరంగల్, అక్టోబర్ 29: వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లా ప్రజలు ఎవరు కూడా ఫిర్యాదులు చేసేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

## ఘనంగా వాకర్స్ ఫౌండర్ అల్వాల్ దాస్ జయంతి

నర్సంపేట, అక్టోబర్ 29: వాకర్స్ ఇంటర్నేషనల్ ఫౌండర్ అల్వాల్ దాస్ జయంతి సందర్భంగా నర్సంపేటలోని సంజీవని అనాథశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 303 క్యాబినెట్ సెక్రటరీ, నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రోజూ వాకింగ్ చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. మాతృభూమి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఏ మోహన్‌రావు, వినోద, వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆడెపు సదానందం, ట్రెజరర్ సంకినేని కృష్ణ, సభ్యులు శ్యామ్‌ప్రసాద్, అహ్మద్ పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ మహాసభను జయప్రదం చేయాలి

చెన్నారావుపేట, అక్టోబర్ 29: హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో నవంబర్ 5న జరుగనున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు బండోజు నర్సింహాచారి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం సంఘం పెద్దలకు విశ్వబ్రాహ్మణ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్, కోశాధికారి సుధాకర్, సహాయ కార్యదర్శి చిటిమల్ల సదాశివుడు, కులపెద్దలు రుద్రమాచారి, సతీశ్, వీరాచారి పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న జిల్లా కమిటీ సభ్యులు